

అనుకొన్నదొకటి....

తాళ్లూరు నాగేశ్వరరావు

జీవితంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలీదు. హెచ్చరిక లేకుండానే ఎన్నో సంఘటనలు సంభవిస్తూఉంటాయి. ఆ కోవకు చెందినవే గవర్నమెంటు సర్వీసులో ట్రాన్స్ఫర్లు కూడాను. ఒక యాక్సిడెండు జరిగినట్టుగా నరసింహారావుకు హఠాత్తుగా ఏలూరునుంచి తెనాలికి ట్రాన్స్ఫరు వొచ్చింది.

ఆరోజు పదీ ఇరవైతొమ్మిది నిముషాలకు ఆఫీసులో తన సీట్లో కూర్చుని, జేబురుమాలుతో మొహానికి పట్టిన చిరుచెమటను తుడుచుకొంటూ ఉండగా ప్యూను ఆ వర్తమానపు లేఖను పువ్వుల్లో పెట్టి అందించాడు. చతువుకొంటూ ఉండగానే శరీరపు ఉష్ణమాపకంలో ఒక్కుమ్మడిగా నూటఆరు డిగ్రీలు పెరిగాయి. వెంటనే

ఓ బడాగ్లాసు మంచినీళ్లు పట్టించి, నివురు గప్పిన నిప్పులా నిట్టూర్చాడు నరసింహారావు. తనకి ట్రాన్స్‌ఫర్ వొచ్చినట్టు ఎవ్వరితోనూ చెప్పుకోలేదు. ఆ ట్రాన్స్‌ఫర్‌ను ఆపుదల చేయించడానికి ఏ రాజకీయ నాయకుణ్ణీ సాష్టాంగపడి ఆశ్రయించలేదు. జరిగిందంతా తన మంచికే అనుకొని వారం రోజుల్లోనే తెనాలికి మకాం మార్చాడు.

నాజర్‌పేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు. చవుగ్గా దొరికింది. సంతోషపడ్డాడు. అతని భార్య శశిరేఖ అమితంగా సంబరపడింది. అరవై రూపాయలకు ఆరుగురు పిల్లలుగల సంసారం నివసించేంత విశాలమైన లోగిలి దొరికింది. కాని నరసింహారావు కుటుంబం. ఎగ్రతికోణం లాంటిదే. ఇంకా కావాల్సిందేముంది?

ముందు ప్రహరీ డ్రాయింగ్ రూమ్ తర్వాత హాలు. బెడ్‌రూమ్, స్టోర్‌రూమ్, కిచన్. దేవునిగదీ, మరో చిన్న పడక గదీ, వెనుక బోలెడంత ఖాళీస్థలం. పెరటి దొడ్లో పిచ్చిమొక్కలు మస్తుగా ఉన్నాయి. పంపుకాకుండా ఓ వరలబావి కూడా ఉంది. అన్నింటికీ మించి ఇల్లు బజారు తల. కాని ఒక దృష్టిలో చూస్తే ఆ ఇల్లు నరసింహారావుకు నచ్చలేదు. వెనుక భాగాన చౌడు వేసిన మొండిగోడ ఉంది. ఆ గోడ అవతల లేబర్ గుడిసెలు ఉన్నాయి. ఆ గుడిసెల్లో ఉండే పనీ పాట జనం నుంచి ప్రొద్దస్తమానమూ సందడి మందంగా వినబడుతూనే ఉంటుంది. వాతావరణమే పరువు తక్కువగా ఉంది. కాని శశిరేఖ సరిపెట్టుకొంది. "వాళ్లెవరో, మన మెవరమో! మన ఇంట్లో మనం గుట్టు చక్కగా ఉంటే, ఇరుగూ పొరుగూ వాళ్ళతో మన కేంపని?" అన్నదామె. నిజమే అనుకొన్నాడు నరసింహారావు.

ఓ నెల గడిచింది.

భార్యాభర్తలిద్దరూ ఓ ప్రణాళికను రూపొందించుకొని, దాని ప్రకారం ఆ ఇంటిని చక్కగా దిద్ది తీర్చారు. పదిహేను రూపాయలు కూలిచ్చి, ఇద్దరు మనుషుల్ని పెట్టి - పెరటి దొడ్డినంతా బాగు చేయించారు. నరసింహారావు ఆఫీసుకు వెళ్ళిన టైంలో, పిల్లలిద్దరూ స్కూలుకు వెళ్ళాక, ఆ తీరుబడి కాలంలో—శశిరేఖ స్వయంగా దగ్గరుండి, పెరటిదొడ్డిని అందంగా, ఆరోగ్యవంతంగా తయారు చేయించింది. అందులో పూలమొక్కలు నాటించింది; కూరగాయ పాదులు పెట్టించింది; ఆకుమళ్లు వేయించింది; వాటికి తగిన నీటి సరఫరా వసతులు సమకూర్చింది. పెరటి తోటల పెంపకమంటే ఆమెకు పిచ్చి సరదా ఆమె సరదాను నరసింహారావుకూడా సమర్థించడం కద్దు.

నెలా పదిహేను రోజుల్లో పూల మొక్కలూ, కూరగాయల చెట్లూ, ఆకుమళ్లూ ఏపుగా ఎదిగి వచ్చాయి. చూడ ముచ్చటగా తయారైనాయి. రోజుకు పదిసార్లు వాటిని చూసుకొంటూ శశిరేఖ మురిసిపోసాగింది.

సాయంత్రపు వేళల్లో భార్యాభర్త లిద్దరూ ఆ పెరటితోట చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయసాగారు. పిల్లలు బయట ఆడుకోడానికి వెళ్ళేవారు.

"చూడండి! తోటకూర మడి ఎంత ఇంపుగా పెరిగిందో! నాలుగాకులు గిల్లి రేపు పప్పులో పెడతాను." అన్నది శశిరేఖ ఆ సాయంత్రపు చల్లదనంలో.

"సెభాష్! నీకృషి ఫలితాన్ని రేపు రుచి చూపించబోతున్నావన్నమాట!" అన్నాడు నరసింహారావు పెదవులు దాటని దరహాసంతో.

శశిరేఖ శరీరం గర్వంతో గరిపొడిచింది.

"పెరటితోటల పెంపకం మన ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనిస్తుంది. ఈ రహస్యాన్ని చాలమంది గ్రహించక పోవడం, పెరటిదొడ్లను బందులదొడ్లలా వాడిలేయడం మన దేశపు దురదృష్టం" అన్నాడు నరసింహారావు. పదేళ్ళ క్రితం చదివిన అర్థశాస్త్రాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

అవునన్నట్టు తల ఆడించింది శశిరేఖ. ఆమెకు అర్థశాస్త్రజ్ఞానం అబ్బలేదు. పొట్ల పాదు దగ్గర నిలబడి, పిందెల్ని పరిశీలిస్తోంది. నరసింహారావు నిమ్మపాదులోని కలుపు మొక్కల్ని ఏరివేయ సాగాడు.

ఆరోజు రాత్రి పడుకొన్న తర్వాత కూడా ఆ దంపతుల సంభాషణ కొంత

సేపు పెరటితోటపై కొనసాగింది. రేపు ఉదయం వండబోయే తోటకూర పప్పును గురించి ఆమె ప్రస్తావించగా, అందులోకి అప్పడాలు ఉన్నాయా? లేవా? అని అతను ప్రశ్నించాడు. మలబార్ మసాలా అప్పడాలున్నాయని ఆమె సమాధానం చెప్పింది. నరసింహారావు నాలుకపై నీళ్లు నిలిచాయి.

మరునాడు ఉదయం మూడు బార్ల ప్రొద్దెక్కేసరికి శశిరేఖ భర్తకు కాఫీ ఇచ్చి, పిల్లలకు బొర్న్‌విటా ఇచ్చి, ఓ చిన్న ప్లాస్టిక్ సంచి పట్టుకొని పెరటితోటదగ్గరకు వచ్చింది—తోటకూర కోయడానికి. తోటకూర మడిని చూడగానే ఆమె ప్రాణాలు కడబట్టాయి. గావుకేక పెట్టింది. అప్పుడే ఓ ఎర్ర కోడి మొండిగోడ దూకి పారిపోయింది.

వరండాలో కూర్చొని తాపీగా దినపత్రిక చూస్తోన్న నరసింరాహావు భార్య కేకకు త్రుళ్ళిపడి, పేపరు వొదిలేసి ఆదరాబాదరా పరుగెత్తుకొచ్చాడు. భార్యామణి ఏ పాముపిల్లను చూసి దడుచుకొందోనని అతని భయం.

"శశీ! శశీ! ఏం జరిగింది?" అన్నాడు నరసింహారావు గొంతులోకి వొచ్చిన గుండెను సర్దుకొంటూ.

మాట్లాడలేని నిశ్చేష్టతలో ఆమె తోటకూర మడికేసి వ్రేలు చూపెట్టింది.

తోటకూర మడంతా పాడై ఉంది. అక్కడక్కడా ఆకులు కొరికి ఉన్నాయి; మొక్కలు పెళ్ళగించి ఉన్నాయి. నిన్నటి దినాన నవనవలాడుతూన్న మడి, తెల్లవారేసరికి ఈడుబోయిన బీడులా ఉంది. నరసింహారావు నోటమాట లేక రెండు నిముషాలు నిలబడ్డాడు.

"ఆ ముదనష్టపుకోడి పనే ఇదంతా?" అన్నది శశిరేఖ కనుకొలకుల్లో నీళ్ళు నిండగా.

"ఎవరిదా కోడి?" అన్నాడు నరసింహారావు క్రోధోన్మత్తుడై.

"లేబరువాళ్ళది." అన్నది శశిరేఖ మొండిగోడకేసి చూస్తూ.

వెంటనే నరసింహారావు మొండిగోడ దగ్గరకు వెళ్ళాడు. కోడి కనబడలేదు. గుడిసెల ముందు పిల్లలు ఆడుకొంటున్నారు. ఒకడు సైకిలు రిక్షాను మసిగుడ్డతో తుడుస్తున్నాడు. ఇంకొకడు ఎండలో రికామీగా కూర్చొని ఎంగిలిబీడీ కాలుస్తున్నాడు. మరొకడు పాత దినపత్రికను శ్రద్ధగా చదువుతున్నాడు. ఒక ఇల్లాలు రోడ్డుకు అడ్డంగా చతికెలబడి, రెండుకాళ్ళూ బార్లా సాచి, ఒడిలో పసిపిల్లను పెట్టుకొని పాలు ఇస్తూన్నది. ఒక ముసలావిడ రోడ్డు దుమ్ముతో ఇత్తడి తపేళా తోముతూంది. ఇంకో ఆవిడ చేటలో బియ్యం పోసుకొని, మట్టిగడ్డలు ఏరివేస్తూ, కిరాణా కొట్టువాణ్ణి దుమ్మెత్తిపోస్తోంది.

"ఏయ్!" అన్నాడు నరసింహారావు మొండిగోడ ఇవతలవుండి. అతని ప్రక్కనే శశిరేఖ నిలబడింది.

అందరి తలలూ ఆ కేకకేసి మళ్లాయి.

"మా దొడ్లోకి ఓ కోడివచ్చి, తోట కూర మడినంతా ధ్వంసం చేసింది. ఎవరిదా కోడి?" అన్నాడు నరసింహారావు క్రొత్తగా ప్రమోషనైన ఆఫీసరు అధికార ధోరణిలో.

పాత దినపత్రిక చదువుతూన్న కార్మిక నాయకుడూ, రిక్షా తుడిచేవాడూ, ఎంగిలి బీడీ కాలుస్తూన్నవాడూ, పిల్లలూ, ఆడంగులూ అందరూ మూక ఉమ్మడిగా మొండి గోడదగ్గరకు వచ్చారు. శశిరేఖకు భయమేసింది.

"కోడికేం తెల్సు బాబూ! కళ్లులేనిది" అన్నాడు కార్మికనాయకుడు దినపత్రికను మడుస్తూ.

"మీకున్నాయిగా కళ్లు, అలా బలాదూరుగా వొదలేయడమేనా? మా తోటకెంత నష్టం కలిగించిందీ!" అన్నాడు నరసింహారావు.

"తప్పైపోనాది బాబులూ! ఇకనుంచీ రానీయంలే. చమించండి" అన్నాడు రిక్షావాడు. వాడిదే కోడి.

"ఈతడవ వస్తే కోడిని కైమాగా వండిస్తా" ఓ మోతాదు తూలాడు నరసింహారావు.

"బూర్జువా మాటలు మాటాడకండి. పేదవాళ్ళేం అంత చేతులు చచ్చి లేరు. కోడిని కైమాచేస్తే, కోర్టు కెక్కించి, జైలు కూడు తినిపిస్తాం, జాగ్రత్త! శ్రామిక వర్గం మీదా మీ దౌర్జన్యం!" అన్నాడు కార్మిక నాయకుడు రుద్రుడై.

శశిరేఖకు తత్తర పుట్టింది. భర్త చేయి పట్టుకుని ఇంట్లోకి లాక్కెళ్ళింది.

ఆ రోజు గడిచింది. ఆ సాయంత్రం వరకూ మళ్ళీ ఆ కోడి ఆ చాయలకు రాలేదు.

మరునాడు ప్రొద్దున్నే వచ్చి— ఆకుమడుల మీద దాడి చేసింది. శశిరేఖ వాపోయింది. నరసింహారావు మళ్ళీ గుడిసెల వారిమీద దండెత్తాడు. ఆ సమయంలో కార్మిక నాయకుడు లేడు. రిక్షావాడు మళ్ళీ 'చమించండి బాబులూ' అన్నాడు. నరసింహారావు బెదిరించాడు. కాని తాటాకు చప్పుళ్ళకు తల వొంచేదెవరు?

ఆ విధంగా రోజూ డ్యూటీ ప్రకారం తెల్లవారేసరికి కోడి రావడమూ, ఆకుమడులను పాడుచేయడమూ, శశిరేఖ నుదురు బాదుకోవడమూ నరసింహారావు నోరు చించుకోవడమూ, రిక్షావాడు క్షమాపణలు చెప్పుకోవడమూ, యిరుగు పొరుగు వాళ్ల కాలక్షేపంగా ఆ దృశ్యాన్ని తిలకించడమూ అలా అలా ఓ వారం రోజులు భాగవతం నడిచింది.

శశిరేఖ బెంబేలు పడసాగింది.

నరసింహారావుకు నరాలు పట్టు సడలినాయి. ఏం చేయాలో అంతు పట్టడం లేదు. ఆ కోడి పెద్ద సమస్యగా తయారైంది.

భార్యా భర్త లిద్దరూ ఓ రోజు రాత్రి ఆలోచనచేశారు. ఇద్దరూ ఓ నిర్ణయానికి

వచ్చారు. ఆ నిర్ణయం ప్రకారం ఆ కోడిని కొందామనుకున్నారు. కాని ఏం చేయాలో కూడా ముందుగా ఆలోచించుకొన్నారు. ఆ మరునాడే మొండిగోడ దగ్గరకు దంపతు లిద్దరూ వెళ్ళి రిక్షావాణ్ణి పిల్చారు. తెచ్చికోలు వినయంతో దణ్ణాలు పెడుతూ వచ్చాడు రిక్షావాడు.

"కోడిని అమ్ముతావా?" సూటిగా ప్రశ్నించాడు నరసింహారావు.

కుడీ, ఎడమా చూసి తల ఆడించాడు రిక్షావాడు.

"ఎంత?"

"ఎంతో నండా బాబుగారూ!.... ఓ పది రూపాయలు!"

"పది రూపాయలే!" అన్నది శశిరేఖ ఆశ్చర్యాశ్చర్యంతో.

"మరేనండే! రొండు కిలోల మాంసం అవలీలగా అవుతాదండి. అల్వాలాంటి మాంసమండీ. ఒక్కసారి తింటే మరి వొదల్రండీ!" అన్నాడు రిక్షావాడు లొట్టలు వేసుకొంటూ.

దంపతులిద్దరూ 'శ్రీహరీ' అనుకుంటూ చెవులు మూసుకున్నారు.

బేరం చేసి చివరకు తొమ్మిది రూపాయలకు ఆ కోడిని కొన్నారు. కాలికి ఓ తాడు కట్టి చెట్టుకు కట్టేశారు.

ఆ మరునాడు నరసింహారావు పై ఆఫీసర్ని ఇంటికి భోజనానికి పిల్చాడు. పై ఆఫీసరు నాయుడు అక్షరాలా నాన్ వెజిటేరియన్. కాని నరసింహారావూ, ఆయన భార్యా యిద్దరూ విశిష్ట శాఖాహారులు. అంచాత నరసింహారావు ప్యూనును పిలిపించి, ఆ కోడిని అప్పగించి, మంచిగా కూర వండుకురమ్మనమని ఆజ్ఞాపించాడు.

కాని ఆ మర్నాడు నాయుడు నరసింహారావు ఇంటికి భోజనానికి రాలేదు. హఠాత్తుగా ఆయనకు కడుపులో నొప్పి వచ్చిందట అందుచేత రాలేనని కబురు చేశాడు. కాని కోడికూర మటుకు నషాళాకు అంటే మషాళాతో తయారై వచ్చింది. నరసింహారావు నిరాశతో క్రుంగిపోయాడు. ఆ కూరను చట్టితోపాటుగా ప్యూను కిచ్చివేసింది శశిరేఖ. తన పంట పడిందనుకొంటూ ఆ ప్యూను పరమానందంతో ఇంటికి వెళ్ళాడు.

కోడి బెడద తప్పింది. పెరటి దొడ్లోని ఆకుమడులు మళ్ళీ పుంజుకొంటున్నాయి. ఏపుగా పెరగసాగాయి. శశిరేఖ సంతోషపడసాగింది

సరిగ్గా వారం రోజుల తర్వాత ఓ ఉదయం మళ్ళీ ఆకుల్ని కోడి కెలకడం చూసి శశిరేఖ నిర్విణ్ణురాలైంది. గావుకేక బెట్టి భర్తను పిలిచింది. ఆ దృశ్యాన్ని నరసింహారావు కూడా చూశాడు. అతని మనస్సు కూ ముల్లు గుచ్చుకున్నట్లయింది. నిశ్శబ్దంగా భార్య కేసి చూశాడు.

"మళ్ళీ ఆ రిక్షావాడు ఇంకో కోడిని కొని మన తోటపైకి ఉసిగొల్పాడు." అన్నది శశిరేఖ.

నరసింహారావులో ఉక్రోషం ఉవ్వె



త్తున లేచింది. గబగబా మొండిగోడ దగ్గరకు వెళ్ళాడు. అతని వెంటే భార్యామణి కూడా నడిచింది. రిక్షావాణ్ణి పిలిచాడు. రిక్షావాడూ, అతని వెంట కార్మిక నాయకుడూ, మరి ఇద్దరూ వచ్చారు. శశిరేఖ భయపడింది.

"మళ్ళీ కోడిని కొన్నావా?" అన్నాడు నరసింహారావు రిక్షావాణ్ణి ఉద్దేశించి.

వాడు అమాయకంగా తల ఆడించాడు.

"ఇవాళ మా దొడ్లోపడి ఆకుమడిని నాశనం చేసింది." అన్నాడు నరసింహారావు గొంతు పెద్దది చేస్తూ.

'అయితే నన్నేం చేయమంటారు?' అన్నట్టు చూశాడు రిక్షావాడు.

"నీ కోడి మళ్ళీ మా దొడ్లోకి వచ్చిందంటే వూరుకోను. జాగ్రత్త! న్యూసెన్సు కేసు పెట్టి, కోర్టు చుట్టూ తిప్పుతాను." అన్నాడు నరసింహారావు.

"కేసు పెట్టండి బాబూ....; బీదా బిక్కీ అంటే అంత లోకువా? ధనిక స్వాముల దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికి మేమంతా ఒకటై పోరాటం సాగిస్తాం. మేం కోళ్ళను పెట్టుకు జీవిస్తాం. అవి నోరులేని పక్షులు. ఎక్కడ తిరగాలో, ఎక్కడ తిరక్కూడదో వాటికేం తెల్సు? మీ తోటకోసం మా జీవనాధారాన్ని వొదులుకోమంటారా?" అన్నాడు కార్మిక నాయకుడు ఉపన్యాస ధోరణిలో.

"దాన్ని జాగ్రత్తగా కట్టివేయండి" అన్నాడు నరసింహారావు.

"అది కుక్క కాదు కట్టివేయడానికి" అన్నాడు కార్మిక నాయకుడు నిర్లక్ష్యంగా.

నరసింహారావుకు నడినెత్తి మండింది. కాని ఏం చేయలేక, గిరుక్కున వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్ళాడు. భార్యామణి అతన్ని అనుసరించింది.

ఆ రోజంతా భార్యా భర్తలు కోడిని గురించి తీవ్రంగా ఆలోచించారు. ఆ సాయంత్రమే నరసింహారావు ఓ ప్లీడరుతో సంప్రదించాడు: న్యూసెన్సు కేసు బెట్టి ఈ బెడదను వొదిలించుకోడానికి అవకాశా లేమైనాఉన్నాయేమోనని. కాని ఆ ప్లీడరు సలహా నరసింహారావుకు నచ్చలేదు. కేసు పెట్టడం వృధా అని ఆయన సలహా సారాంశం.

రిక్షావాని కోడి రోజూ ప్రొద్దున్నే క్రమం తప్పకుండా నరసింహారావు పెరటి దొడ్డిని పావనం చేస్తూనే ఉంది. భార్యా భర్త లిద్దరూ ఆలోచనలమీద ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. రెండు మూడు సార్లు శశిరేఖ రాయి పుచ్చుకుని ఆ కోడివెంట బడింది ఆమె విసిరిన రాయి దానికి తగ ల్లేదు.కోడి తప్పించుకొంది. అయినా అది రావటంమానలేదు.

ఒకరోజు నరసింహారావు ఇంటి ఓనర్ దగ్గరకు వెళ్ళాడు. కోడి కథ సవిస్తరంగా చెప్పాడు. తన అదుర్దానూ, ఆవేదననూ, పెరటితోట మీద తను పెట్టిన్న పెట్టు బడినీ, తన భార్యకు ఆ తోటపై ఉన్న మోజునూ,మమకారాన్నీ తెలియజెప్పాడు. పాపం, ఇంటి ఓనరు నోటితో సానుభూతి చెప్పాడుగానీ—తను కార్యరూపంలో చేయగల సహాయమేమీ లేదని స్పష్ట పరి చాడు.

"ఆ మొండిగోడను పడగొట్టించి, దానిస్థానే పక్కాగోడ కట్టించండి" అర్థించాడు నరసింహారావు.

"నా దగ్గర డబ్బులేదు. మీరు కట్టించి, అద్దెలో తగ్గించుకొంటే నాకభ్యంతరం లేదు." అన్నాడు ఇంటి ఓనరు.

కొంతమేరకు సంతృప్తిపడ్డాడు నర సింహారావు. ఆ ప్రణాళికను గురించి భార్యకు చెప్పాడు. తోట రక్షణకోసం ఆమె అదుర్దా కనబరుస్తోంది కాబట్టి ఇట్టే ఒప్పేసుకుంది.

ఆ మరునాడే నరసింహారావు ఇటుకా, సున్నానికి ఆర్డరు ఇచ్చాడు. నలుగురు కూలీల్ని పిలిపించి కందకాలు త్రవ్వించాడు. తాపీమేస్త్రీని పిల్చి వారంరోజుల్లో గోడ అయిపోవాలన్నాడు.

"వారం దేనికండీ! డబ్బు ఆజీలుగా వుంటే మూడ్రోజుల్లో ముగించేయనూ!" అన్నాడు మేస్త్రీ మస్తాన్.

సున్నం, రాయీ, ఇసుకా, కూలీలూ అంతా సిద్ధం. మూడు రోజులకే గోడ



సగం లేచింది. నరసింహారావు ఆ గోడ కట్టుబడికి సెలవైతే పెట్టలేదుగానీ, శశిరేఖ దగ్గరుండి కట్టించసాగింది. ఉదయమూ, సాయంత్రమూ నరసింహారావు దగ్గరే ఉంటున్నాడు.

ఆ రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకు నరసింహారావు అగమేఘాల మీద ఆఫీసు నుంచి ఇంటికొచ్చాడు. వచ్చీ రావడంతో నేరుగా పెరటి దొడ్లోకి వెళ్ళాడు. జామచెట్టు దగ్గరుండే, "గోడ ఆపండి" అంటూ గావు కేక బెట్టాడు.

మూల మట్టంతో ఇటుకరాయి లెవల్ చూస్తోన్న మేస్త్రీమస్తానూ, సున్నం ఇసుకా కలుపుతూన్న కూలీలూ, గోడదగ్గర నిలబడ్డ శశిరేఖా ఆశ్చర్యంతో మొహాలెత్తి చూశారు.

"ఏమిటి? ఏం జరిగిందండీ!" అన్నది శశిరేఖ ఆశ్చర్యంతో కనుబొమలు వెడల్పు చేసి.

"కొంపమునిగింది. ఇక్కణ్ణుంచి రాజమండ్రికి ట్రాన్స్‌ఫరైంది. బిచాణా ఎత్తివేయాలి వారం రోజుల్లోపల" అన్నాడు నరసింహారావు. గొంతులో దుఃఖాన్ని జవజవలాడిస్తూ.